ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదని నిరూపిస్తే రాజీనామా!

- లేదంటే నీ పదవికి రాజీనామా చేస్తవా?
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ సవాల్
- తెలంగాణలో మహాత్ముడి ఆనవాళ్లూ ఉండొద్దా?
- చెడు విను, చెడు చూడు, చెడు మాట్లాడు అనేది సీఎం రేవంత్ సిద్ధాంతం: నిప్పులు చెరిగిన హరీశ్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): 'బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదని నిరూపిస్తే రాజీనామాకు నేను సిద్ధం.. లేదంటే నీ పదవికి రాజీనామా చేస్తవా? అని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. సోమవారం ఓ చానల్‌తో ఆయన మాట్లాడుతూ తన వైఫల్యాలను ప్రతిపక్షాల మీదకు నెట్టి తప్పించుకోవాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని విమర్శించారు. గొంతు పెద్దది చేసి మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజాలు కాబోవని హితవు పలికారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎస్ఎల్‌బీసీ పనులే జరగలేదని సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని.. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టు కోసం రూ.3900 కోట్లు ఖర్చుపెట్టి పనులు చేశామని, 11.5 కి.మీ మేర టన్నెల్ తవ్వామని గుర్తుచేశారు. డీవాటరింగ్‌కు కూడా కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇచ్చామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌తో పాటు డిండి, పెండ్లిపాక రిజర్వాయర్లను బీఆర్ఎస్ హయాంలోనే పూర్తిచేశామని చెప్పారు. టన్నెల్‌లో ప్రమాదం జరిగి పది రోజులైనా రెస్క్యూ ఆపరేషన్ కొలిక్కి రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కనీసం మృతదేహాలను కూడా బయటకు తీసుకురాలేదని వాపోయారు. ఈ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయిందని మండిపడ్డారు. రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని వారం క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీని సందర్శించి రెస్క్యూ ఆపరేషన్‌ను రెండు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రమాదం జరిగి 10 రోజుల తర్వాత కూడా కనీసం ఎస్ఎల్‌బీసీ వద్ద కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి ఉత్తమ్‌ను బద్నాం చేయడానికే సీఎం రేవంత్ ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని పట్టించుకోవడం

> టన్నెల్‌లో ప్రమాదం జరిగి పది రోజులైనా రెస్క్యూ ఆపరేషన్ కొలిక్కి రాలేదు. ఈ ప్రభుత్వం కనీసం మృతదేహాలను కూడా బయటకు తీసుకురాలేక పోతున్నది. ఈ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైంది. 2 రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని వారం కింద మంత్రి ఉత్తమ్ చెప్పిండ్రు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పోయి రెస్క్యూ ఆపరేషన్‌ను రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నరు. ఇంకా ఎన్ని రోజులు సాగదీస్తరు?
>
> - హరీశ్‌రావు

లేదా? అని ప్రశ్నించారు. సీఎం, మంత్రి మధ్య ఉన్న రాజకీయ విభేదాలే 8 మంది ప్రాణాలను బలి తీసుకున్నాయా? అనే అనుమానం వ్యక్తంచేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో ఎనిమిది ప్రాణాలు పోయాయని విమర్శించారు.

మహాత్ముడికి ఇచ్చే విలువ ఇదేనా?

జాతిపిత గాంధీ పేరు చెప్పి రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకోవడమే తప్ప ఆ మహాత్ముడికి రేవంత్‌రెడ్డి ఇచ్చే విలువ ఇదేనా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాల పట్ల కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి ఏమాత్రం గౌరవం లేదని దుయ్యబట్టారు. 2022లో గాంధీ జయంతి (అక్టోబర్ 2) సందర్భంగా నాటి సీఎం కేసీఆర్ గాంధీ దవాఖాన ఎదుట ఆవిష్కరించిన గాంధీ కాంస్య విగ్రహంపైనా రేవంత్‌రెడ్డి తన కురుచబుద్ధిని ప్రదర్శించారని సోమవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా, తుడిచేస్తా అనే కురుచ బుద్ధితో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి జాతిపిత గాంధీజీ కూడా టార్గెట్ అయినట్టున్నారు. 'చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అనేది గాంధీ సిద్ధాంతమైతే రేవంత్‌రెడ్డిది చెడు విను, చెడు చూడు, చెడు మాట్లాడు అనే సిద్ధాంతం. అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేయడానికి ఆయన అనుసరిస్తున్న మూల సూత్రమని చెప్పారు.

డ్యామేజ్ డైవర్షన్ కుట్రలు సాగవు

- ఎస్ఎల్‌బీసీ సొరంగంపై రేవంత్ దుర్మార్గ ప్రచారం
- గల్లీ నుంచి ఢిల్లీ దాకా కమీషన్లిచ్చే ప్రాజెక్టులు చేపట్టి వాటిని మధ్యలోనే వదిలేసే నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీది
- 3900 కోట్లు పెట్టి 11.5 కి.మీ తవ్విన చరిత్ర బీఆర్ఎస్‌ది
- కాంగ్రెస్ మతిలేని విధానాలతోనే టన్నెల్‌లో 8 మంది బలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు వల్ల డ్యామేజీ అయిన ఎల్ఎస్‌బీసీ సొరంగంపై రేవంత్‌రెడ్డి డైవర్షన్ కుట్రలకు పాల్పడుతున్నారని, చైతన్యవంతమైన తెలంగాణ గడ్డపై ఈ కుట్రలు ఎప్పటికీ సాగవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. సొరంగం ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ కూడా తవ్వకపోగా, 11.5 కిలోమీటర్ల సొరంగాన్ని పూర్తిచేసిన బీఆర్ఎస్ పాలనపై రేవంత్ నిందలు వేయటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను సోమవారం ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లయితే, 2005–2014 వరకున్న గత కాంగ్రెస్ సర్కారు హయాంలో తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లేనని, సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులను పూర్తిచేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని వివరించారు.

> 13 నెలలుగా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులను పండబెట్టి, తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నీచానికి దిగడం అత్యంత దుర్మార్గం. కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, 4 రోజులు కాకముందే 8 మంది అమాయకుల నిండు ప్రాణాలను బలి గొన్న పాపం ముఖ్యమంత్రిదే..
>
> -కేటీఆర్

నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ పనులకు రూ.3300 కోట్ల ఖర్చుచేస్తే, బీఆర్ఎస్ హయాంలో రూ.3900 కోట్లతో పనులు పూర్తి చేసిన వాస్తవాన్ని దాచే ప్రయత్నంలో ముఖ్యమంత్రి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవాచేశారు. గత కాంగ్రెస్ సర్కారు కన్నా రూ.600 కోట్లు ఎక్కువ ఖర్చుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం కాంగ్రెస్ సర్కార్ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడున్నరేండ్ల లోనే 203 కిలోమీటర్ల టన్నెళ్లు తవ్వినా, ఎస్ఎల్‌బీసీ వంటి దారుణ సంఘటన జరిగిన దాఖలా లేదని గుర్తుచేశారు. రైతులకు నీళ్లిచ్చే ప్రాజెక్టులను కాకుండా గల్లీ నుంచి ఢిల్లీదాకా కమీషన్లు ఇచ్చే ప్రాజెక్టులను చేపట్టి వాటిని అర్ధాంతరంగా గాలికి వదిలేసే నీచ చరిత్ర కాంగ్రెస్‌దేనని ఫైర్ అయ్యారు. చేసిన తప్పును ఒప్పుకోవడం తప్ప సీఎంకు మరో మార్గం లేదేని, 'డ్యామేజ్ డైవర్షన్' కుట్రలు చైతన్యవంతమైన తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవని హెచ్చరించారు.

కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్

కరోనా కన్నా డేంజరెస్ వైరస్ కాంగ్రెస్ అని కేటీఆర్ విమర్శించారు. ఏడాది క్రితం తాము చెప్పింది నేడు అక్షరాలా నిజమైందని, రాష్ట్ర అభివృద్ధిని అసమర్థ సీఎం గొ య్యితీసి పాతరేశారని ధ్వజమెత్తారు. దేశంలోనే అగ్రభాగాన ఉన్న తెలంగాణను ఆఖరు స్థానానికి పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నిరుడు 10 శాతం నమోదైన జీఎస్టీ వసూళ్లు కేవలం ఒక్కశాతం వృద్ధికి పడిపోవటం సిగ్గుచేటని పేర్కొన్నారు. దారీతెన్నూలేని చెత్త నిర్ణయాలతోనే ఈ పతనమని విమర్శించారు. ప్రభుత్వ పెద్దల కమీషన్లు ఆకాశానికి అంటుతుంటే రాష్ట్రప్రగతి పాతాళానికి పడిపోతున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాబడులు కుప్పకూలడం క్షమించరాని నేరమని, కేసీఆర్ హయాంలో వెలుగొందిన స్వర్ణయుగాన్ని చెరిపేసి సీఎం రాసుకునే చీకటి చరిత్ర ఇదేనా? అని నిప్పులు చెరిగారు.

మిషన్ సీఎం చేంజ్!

- డిసెంబర్ నాటికి సీఎం మార్పు!
- మీనాక్షికి రాహుల్ అప్పగించిన టాస్క్ ఇదే
- క్యాబినెట్ నుంచే కొత్త సీఎం ఎంపిక ఉంటుంది
- అధిష్ఠానం సంకేతాలతోనే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- అడ్డగోలుగా నలుగురు మంత్రుల వసూల్ దందా
- సీఎం, మంత్రులపై ఏలేటి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధిష్ఠానం డిసెంబర్ నాటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పదవి నుంచి తప్పించడం ఖాయమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం ఏలేటి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోర్ టీమ్ సభ్యురాలు మీనాక్షికి తెలంగాణ ఇన్‌చార్జిగా నియమిస్తూ అప్పగించిన టాస్క్ కూడా ఇదేనని చెప్పారు. డిసెంబర్ నాటికి 'మిషన్ సీఎం చేంజ్' టాస్క్‌కు గ్రౌండ్ ప్రిపేర్ చేయడమే లక్ష్యంగా మీనాక్షి నటరాజన్ పని చేస్తున్నారని చెప్పారు. తన కుర్చీ లాగేసేందుకు మంత్రులే యత్నిస్తున్నారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు? డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సీఎం కుర్చీపై కన్నేశారని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్, క్యాబినెట్ పూర్తిగా గాడితప్పాయని విమర్శించారు. ఎవరి రాజ్యం వారిదే అన్నట్టుగా సీఎం, మంత్రుల మధ్య గ్యాప్ ఏర్పడిందని తెలిపారు. ఒక్క మంత్రీ తనను లెక్క చేయట్లేదని సీఎం రేవంతే గాంధీభవన్‌లో మీనాక్షి నటరాజన్ వద్ద గోడు వెళ్లబోసుకున్నారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

ఆర్, యూ, బీ, పీ ట్యాక్స్‌లు!

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు ముఖ్యమంత్రి మాత్రమే అధిష్ఠానం పెద్దలకు కప్పం కట్టేవారని, ఇప్పుడు సీఎం పదవి పోటీలో ఉన్న మంత్రులు కూడా కప్పం కడుతున్నారని ఏలేటి ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో మునుపెన్నడూ జరగని కుంభకోణాలతో అక్రమంగా సంపాదిస్తూ ఢిల్లీకి అత్యధిక కప్పం మంత్రి పొంగులేటి కడుతున్నారని అన్నారు. ఇప్పటివరకు 'ఆర్, యూ, బీ' ట్యాక్స్‌లు ఉండగా కొత్తగా 'పీ' ట్యాక్స్ కూడా జత కలిసిందని చెప్పారు. 'బీ' ట్యాక్స్ 15 శాతం, 'పీ' ట్యాక్స్ 50 శాతం నడుస్తున్నదని ఆరోపించారు. ఎవరికి వారు సీఎంకు రావాల్సిన ట్యాక్స్‌కు గండి పెడుతుంటే రేవంత్‌రెడ్డి నేరుగా ఢిల్లీ వెళ్లి ఎంత కప్పం కట్టాలో చెప్పండి కట్టేస్తాను అని అధిష్ఠానం పెద్దలతో చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నదని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇది మామూలు ప్రభుత్వం కాదని, ట్యాక్స్‌ల సర్కారు అని ఎద్దేవా చేశారు.

మాకో పదవి కావాలి... నేనొక్కడిని చాలు!

బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టుబడుతున్నారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్సీలు కూడా మరోమంత్రి పదవి కావాలని అడిగితే భట్టివిక్రమార్క అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను ఒక్కడినే పదవిలో ఉండాలని కోరుకుంటున్నారని విమర్శించారు. మరొకరు పదవిలో ఉంటే తన ప్రాధాన్యత తగ్గిపోతుందని భావిస్తున్నట్టు అభిప్రాయం వ్యక్తంచేశారు. సీఎం సీటును టార్గెట్ పెట్టుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై సీఎం ఎందుకు కమిటీ వేయడంలేదని ప్రశ్నించారు. గతంలో సీఎం ఎక్కడ ఉంటే పొంగులేటి అక్కడ ఉండేవారని, ఇప్పుడు ఎక్కడా కనిపించడంలేదని చెప్పారు. అందుకే మంత్రి శ్రీధర్‌బాబును రేవంత్ వెంటపెట్టుకుని తిరుగుతున్నారని తెలిపారు.

ఎస్ఎల్బీసీ ఘటనపై విచారణకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంపై విచారణ అవసరం లేదని హైకోర్టు పేర్కొంది. ఆ ప్రమాదం జరిగి 10 రోజులవుతున్నా కార్మికుల ఆచూకీ లేదని, సొరంగ నిర్మాణాన్ని నిలిపివేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సహాయ చర్యల గురించి వివరించారు. 44 కి.మీ. పొడవైన సొరంగం పనుల్లో చాలా వరకు పూర్తయ్యాయని చెప్పారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వం చెప్పిన సహాయక చర్యల్లో లోటుపాట్లు ఉంటే పిటిషనర్ తిరిగి హైకోర్టుకు రావచ్చునని స్పష్టం చేస్తూ.. పిల్‌పై విచారణ ముగించింది.

అక్రమ మైనింగ్‌పై హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్టు అందిన లేఖను హైకోర్టు సుమోటో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి, సోమవారం విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు గనులు, భూగర్భ శాఖకు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శికి, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేస్తున్నట్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ప్రకటించింది.

కోతుల బెడదపై పిల్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కోతుల బెడద నివారణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి అధ్యక్షుడు ఎం మల్లన్న రాసిన లేఖను హైకోర్టు సుమోటో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి సోమవారం విచారణ చేపట్టింది. ఈ పిల్‌ను గతంలో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంతో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ సీటుకు హస్తం పార్టీపై మిత్రపక్షాల ఒత్తిడి

- మిత్రధర్మం పాటించాలని పీసీసీకి సీపీఐ వినతి
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని వెల్లడి
- పాత్రులో భాగంగా సీటు కోసం టీజేఎస్ యత్నం
- ఎంఐఎంకు ఇచ్చేందుకు కాంగ్రెస్‌లోనే సుముఖత

హైదరాబాద్, మార్చి 3 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్ల కోసం కాంగ్రెస్‌కు మిత్రపక్షాల నుంచి ఒత్తిడి పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్ మధ్య పొత్తు కుదిరింది. ఈ మేరకు తాజాగా సీపీఐ బృందం సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ సీనియర్ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, తక్కళ్లపల్లి రాజేశ్వర రావు, పల్లె నర్సింహ బృందం పీసీసీ చీఫ్‌ను కలిశారు. తమ పార్టీ నుంచి ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లోనే సీపీఐ ఒక సీటు కోసం తీవ్రంగా ప్రయత్నించి భంగపడింది. ఈ ఎన్నికల్లోనే సీపీఐకి ఎమ్మెల్సీ సీటు ఇస్తే దశాబ్దంన్నర తర్వాత ఉభయ సభల్లో ఆ పార్టీకి ప్రాతినిధ్యం దక్కనున్నది. టీజేఎస్ కూడా అంతర్గతంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. కొంతకాలంగా ఎంఐఎం, కాంగ్రెస్ సఖ్యతతో ఉన్న నేపథ్యంలో ఒక స్థానం ఎంఐఎంకు కేటాయించే అవకాశాలు కూడా ఉన్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీ మేరకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో ఒకటి తమ పార్టీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. తర్వాత మరో ఎమ్మెల్సీ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఈ అంశంపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు.

తుక్కు కింద అమ్మకానికి!

మొదటిపేజీ తరువాయి...

సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది.

రెండోసారి స్క్రాప్ వేలం

కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ–వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించాలని ఆందోళన చేస్తున్న అఖిలపక్షం నాయకులు (ఫైల్)

పునఃప్రారంభానికి అవకాశాలున్నా..

ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభించడానికి అన్ని అవకాశాన్నా కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణిని అవలంబిస్తున్నది. జాతీయ రహదారి–44 ఆనుకొని ఉన్న ఈ పరిశ్రమ నుంచి మహారాష్ట్రతోపాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు సిమెంట్ తరలించేందుకు రోడ్డు, రైలు మార్గం అందుబాటులో ఉన్నది. 772 ఎకరాల భూములు, 170 ఎకరాల్లో టౌన్‌షిప్, 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలూ ఉన్నాయి. పరిశ్రమకు అవసరమైన విద్యుత్తుతోపాటు నీటి వనరులు ఉన్నాయి. సిమెంటు తయారీకి అపారమైన వనరులున్నా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరితో పరిశ్రమను విక్రయానికి పెట్టడంపై కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీసీఐని సందర్శించిన కేంద్ర మాజీ మంత్రి హన్స్‌రాజ్‌తోపాటు ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా పరిశ్రమను పుర:ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నది. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. మూతపడిన ఆదిలాబాద్ సీసీఐని ప్రారంభించాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. పరిశ్రమ ప్రారంభమైతే వేలాది మందికి ఉపాధి లభించడంతో పాటు జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది. సీసీఐ యంత్రాల వేలాన్ని సాధన కమిటీ ఆధ్వర్యంలో అడ్డుకుంటాం.

- విజ్జగిరి నారాయణ,
సీసీఐ సాధన కమిటీ నాయకుడు

డామిట్ కథ అడ్డం తిరిగింది!

- బెడిసికొట్టిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యనేత ప్లాన్!
- పాత దూతను తప్పిద్దామని నమ్మించి వంచించే వ్యూహం
- ఆధారాలతో సహా పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు
- ఉత్తరాది నుంచి అనుకూల కొత్త దూతకోసం ఎత్తుగడ
- మధ్యలో దూరి చక్రంతిప్పిన రాష్ట్రంలోని మరో కీలక నేత
- రాష్ట్రానికి కొత్త దూతను 'కొని' తెచ్చుకొన్న పరిణామం

హైదరాబాద్, మార్చి 3(నమస్తే తెలంగాణ): పాత దూతను తప్పించి, నచ్చిన నేతకు బాధ్యతలు ఇప్పించుకుందామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యూహకర్త, ముఖ్య నేత వేసిన ఎత్తులు బెడిసికొట్టినట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రచారం జరుగుతున్నది. కొత్త దూతను గుప్పిట్లో పెట్టుకొని రాష్ట్రాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుదామనుకున్న వారి ఆశలను అధిష్ఠానం తుంచివేసినట్టు చర్చ జరుగుతున్నది. అత్యాశకు పోతే మొదటికే మోసం వచ్చిందని, కొత్తదూత రూపంలో వచ్చిన నేత ఎప్పుడు ఏం ఉపద్రవం తీసుకొస్తుందో.. ఢిల్లీకేం నివేదికలు పంపిస్తుందోనని వలస కాంగ్రెస్ వర్గం నేతలు ఆందోళనలో ఉన్నట్టు సమాచారం. ముఖ్యనేత అవినీతికి, దారితప్పిన పాలనకు చెక్ పెట్టడానికే కొత్త దూత రాష్ట్రానికి వచ్చినట్టు రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. పాత దూతను బుట్టలో వేసుకున్న ఆ ముఖ్యనేత ఏడాదికాలంపాటు రాష్ట్రంలో పార్టీని, ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టించినట్టు ఏఐసీసీ గుర్తించిందని సమాచారం. భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతూ, అక్రమ వసూళ్లు చేస్తున్నారని, పైగా ఈ నగదును ఢిల్లీ అధిష్ఠానానికే పంపిస్తున్నట్టు పలువురి వద్ద బహిరంగంగానే ప్రస్తావించినట్టు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అధిష్ఠానం విచారణ ఆదేశాలను అడ్డంపెట్టుకొని పాత దూత, ముఖ్య నేత పట్టు సాధించడానికి ప్రయత్నించినట్టు పార్టీ శ్రేణులు చెప్పున్నాయి. తానే సొంతంగా దుకాణం తెరిచి పైరవీలు మొదలు పెట్టినట్టు, కాంట్రాక్టు బిల్లులు మొదలు మంత్రివర్గ విస్తరణ ఆశావహుల వరకు అన్నీ తానై నడిపించినట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ ద్వారా సమగ్ర ఆధారాలు తెప్పించిన ఆ ముఖ్య నేత.. ఆ దూతపై నేరుగా ఏఐసీసీకే ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

మధ్యలోకొచ్చిన మరో కీలక నేత

రాష్ట్ర దూతగా ఆమెను మారిస్తే, తనకు అనుకూలమైన వారిని దూతగా రప్పించుకునేందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్తతో కలిసి ఆ ముఖ